# రైస్ మిల్లుపై సివిల్ సప్లై దాడులు

- సీఎంఆర్ రికవరీ కోసం రూ.6 కోట్ల ధాన్యం సీజ్
- పచ్చి వడ్లు కొనుగోలు చేస్తున్న మిల్లుపై దాడి తగదన్న రైతులు
- రైస్ మిల్లర్ల సిండికేట్‌పై డీఎంకు రైతుల ఫిర్యాదు

సీజ్ చేసిన ధాన్యం నిల్వలను గణిస్తున్న పౌర సరఫరాల అధికారులు

ములుగు, మే 3 (నమస్తే తెలంగాణ): కస్టమ్స్ మిల్లింగ్ రైస్ రికవరీ కోసం సివిల్ సప్లై అధికారులు శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని జీవంతరావుపల్లి రోడ్డులోని లక్ష్మీసహస్ర రైస్ మిల్లులో శుక్రవారం దాడులు చేశారు. మిల్లు యజమాని మహేందర్ రావు 2020 నుంచి ప్రభుత్వానికి రూ.12 కోట్ల సీఎంఆర్ రైస్ బాకీ ఉండగా, బకాయి డబ్బులను వసూలు చేసేందుకు సివిల్ సప్లై డీఎం రాంపతి సిబ్బందితో కలిసి దాడులు చేశారు. మిల్లులో ఉన్న రూ.6 కోట్ల విలువైన ధాన్యాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాంపతి మాట్లాడుతూ రెండేళ్ల నుంచి రైస్ మిల్లును ఇతరులకు లీజ్‌కు ఇచ్చి ప్రైవేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడని, పచ్చివడ్లను రైతుల వద్ద నుంచి మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నాడని వివరించారు. రైస్ మిల్లర్‌పై అధికారులు దాడులు చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న కొందరు రైతులు డీఎం వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదని, తాము పండించిన వడ్లను అదునుకు అమ్ముకునేందుకు వస్తే ఇలా రైస్ మిల్లులోని ధాన్యాన్ని సీజ్ చేశామని చెప్పడం సరికాదన్నారు. రైతులకు మేలు చేసేలా పచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్న మిల్లును సీజ్ చేస్తే రైతులు పంటలను పట్టుకొని ఎక్కడికి వెళ్లాలో చెప్పాలని నిలదీశారు. జిల్లాలో సిండికేట్‌గా మారిన రైస్ మిల్లర్లు రైతులు పండించిన ధాన్యానికి విలువ లేకుండా మాట్లాడుతున్నారని, క్వింటాల్‌కు 10 కేజీల చొప్పున కట్ చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. స్పందించిన డీఎం తాను బదిలీపై రెండు నెలల క్రితమే జిల్లాకు వచ్చానని తెలిపారు. రైతుల సమస్యలు ఏమైనా ఉంటే వాటిని ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**సిండికేట్ రైస్ మిల్లర్లను నిలదీసిన రైతులు**

ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లుపై రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులు కుట్ర పూరితంగా దాడులు చేయించారని డీఎం సమక్షంలో రైస్ మిల్లర్లను రైతులు నిలదీశారు. పచ్చివడ్లను కోసినవి కోసినట్లు కొనుగోలు చేస్తున్న రైస్ మిల్లుపై దాడి చేస్తే ధాన్యం విక్రయించుకునేందుకు వచ్చిన రైతుల మంతా ఎక్కడ అమ్ముకోవాలో చూపించాలని ప్రశ్నించారు. అక్కడే ఉన్న రైస్ మిల్లర్లు మధ్యలో మాట్లాడే ప్రయత్నం చేయగా, ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని మెతుకు మింగనివ్వకుండా మాట్లాడడంతో చేసేదేమీ లేక గప్‌చుప్‌గా ఉండిపోయారు. కాగా, ఈ విషయమై రైస్ మిల్లు యజమాని మహేందర్ రావు మాట్లాడుతూ రైస్ మిల్లర్లు కుట్రతోనే తన మిల్లుపై దాడులు చేయించారని ఆరోపించారు. సీఎంఆర్ బాకీ విషయంలో కోర్టులో కేసు నడుస్తుందని, కోర్టు తీర్పు ప్రకారం నడుచుకుంటానని తెలిపారు.

సివిల్ సప్లై డీఎంకు సమస్యలను వివరిస్తున్న రైతులు

## చెల్పూరులో 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత

భూపాలపల్లి రూరల్, మే 3: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులో శుక్రవారం అత్యధికంగా 46.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు జిల్లా వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మొగుళ్లపల్లిలో 46, రేగొండ 45.8, మల్హార్ 45.6, చిట్యాల 45.3, కాటారం 45.2, మహాముత్తారం 45, టేకుమట్ల 42.2, మహదేవపూర్ 44.2, పలిమెల 43.6, భూపాలపల్లి మండలంలో 44.2 డిగ్రీలు నమోదైనట్లు వివరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బకు గురవకుండా జాగ్రత్తలు పాటించాలని, అత్యవసరమైతేనే గొడుగుతో బయటకు వెళ్లాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ భవేశ్‌మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే

- వేసవి దృష్ట్యా ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్‌మిశ్రా
- జయశంకర్ జిల్లా కేంద్రంలో 5కే రన్ ■ హాజరైన ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్‌మిశ్రా సూచించారు. శుక్రవారం స్వీప్ నోడల్ అధికారి జడ్పీ సీఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానం నుంచి జయశంకర్ విగ్రహం వరకు 'ఓట్ ఫర్ షూర్' నినాదంతో 5కే రన్‌ను ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుపై అవగాహన కల్పించడంతోపాటు పోలింగ్‌శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమంలో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా ఓటు వేసేందుకు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు రావాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, వీల్‌చైర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీడ కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట మైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీపీఓ శామ్యూల్, ఉద్యాన అధికారి సంజీవరావు, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శైలజ, సునీత, డీఎఫ్ఓ ఓ చిర్ర రఘు, ఆర్డీవో మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించాం..

భూపాలపల్లి రూరల్ : పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్‌మిశ్రా తెలిపారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంల కేటాయింపు, సప్లిమెంటర్ ర్యాండమైజేషన్‌ను కలెక్టర్ నిర్వహించారు. అనంతరం రాజకీయపార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలోని 317 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించామని, హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న 85ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఈనెల 4, 5 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5 నుంచి 8వ తేదీ వరకు ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఏర్పా ట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో 2,027 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారని తెలిపారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్, ఈవీఎంలు, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మంగీలా ల్, మున్సి పల్ కమిషనర్ రాజేందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల డీటీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

**11వ తేదీ వరకు ఏర్పాట్లు పూర్తిచేయండి**

ఎంపీ ఎన్నికల నిర్వహణకు భూపాలపల్లి నియోజకవర్గంలోని 317 పోలింగ్ కేంద్రాల్లో 11వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, రెవెన్యూ, మండల ప్రత్యేక, సెక్టోరియల్ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 6వ తేదీ వరకు ఓటరు స్లిప్పులు అందజేయాలని, పోలింగ్ కేంద్రాలను 8రోజుల్లో శుభ్రం చేయాలన్నారు. ప్రత్యేక అధికారులుగా భూపాలపల్లి మండలానికి డీపీవో నారాయణరావు, గణపురానికి ఆర్డీవో నరేశ్, రేగొండకు సీఈవో సామ్యూల్, కొత్త పల్లి(ఘోరి)కి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్, చిట్యాలకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, టేకుమట్లకు బీసీ సంక్షేమాధికారి శైలజ, మొగుళ్లపల్లికి ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, శాయంపేటకు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సంజీవరావును నియమించినట్లు వివరించారు. స్వీప్ నోడల్ అధికారి, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఆర్డీవో మంగిలాల్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ములుగురూరల్, మే 3 : పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో బ్యాలెట్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 8 వరకు అర్హులైన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే వారు గుర్తింపు కార్డుతో పాటు ఓటరు స్లిప్పు వెంట తెచ్చుకోవాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి సమయం కేటాయించినట్లు తెలిపారు.

హోం ఓటింగ్ నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది

నియోజకవర్గంలో ఫాం 12డీ ద్వారా 85 ఏండ్ల వృద్ధులు, దివ్యాంగులు, ఓటర్లు మొత్తం 78 మంది ఉండగా, 44 మంది ఓటర్లు ఇంటి వద్దనే ఉండి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మిగతా 33 మంది సైతం ఓ టు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



రేగొండ : ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

# కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

**మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ■ పలుచోట్ల ఎన్నికల ప్రచారం**

రేగొండ/కృష్ణకాలనీ, మే 3: ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ఓట్లు అడుగుతున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ శుక్రవారం రేగొండ మండలం తిరుమలగిరిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పలుచోట్ల ప్రచారం చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న చోటకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, 11వ వార్డు కౌన్సిలర్ రజితా జుమ్మూలాల్ ఆధ్వర్యంలో భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి వేశాలపల్లి, భాస్కర్‌గడ్డ, పెద్దకుంటపల్లిలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు కక్షపూరిత రాజకీయాలు చేస్తూ కేసులు పెడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సుఖశాంతులతో ఉన్నారని, సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మోసకారులు రాజ్యమేలుతున్నారని, ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చకపోవడంపై కాంగ్రెస్‌లను ప్రజలు ప్రశ్నించాలన్నారు. దేవుళ్లమీద ఒట్లు పెడుతున్న రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మడం లేదన్నారు. భూపాలపల్లి జిల్లాను తీసేస్తామంటున్న రేవంత్‌రెడ్డికి ఆ హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. బీజేపీ దేశంలో మతాల మధ్య చిచ్చు పెట్టి, రాజ్యాంగానికి విఘాతం కలిగించేలా కుట్ర చేస్తోందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ రేగొండ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, ఇంగే మహేందర్, విద్యాసాగర్‌రెడ్డి, మాదాటి కర్ణాకర్‌రెడ్డి, గోపు రాంరెడ్డి, పగడాల ఐలయ్య, వీరన్న, భూపాలపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సెగ్గం వెంకట రాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, కౌన్సిలర్లు నూనె రాజు, జక్కం రవికుమార్, మంగళపల్లి తిరుపతి, మంజంపెల్లి మురళీధర్, ఎడ్ల మౌనిక శ్రీనివాస్, బీబీచారి, అజయ్ యాదవ్, మోతె రాజు, దుండ్ర కుమార్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, బండారి రవి, పోలవేని అశోక్, సతీష్ కుమార్, శ్రీకాంత్ పటేల్, ప్రకాశ్, రాకేశ్, మేకల సతీష్, పల్లెవేన సతీష్ కుమార్, మహిళా నాయకులు ముష్మే పద్మ, ఈర్ల స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీటీసీ గొర్రె సాగర్

## బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి

చిట్యాల, మే 3 : పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని జడ్పీటీసీ గొర్రె సాగర్ కోరారు. శుక్రవారం మండలంలోని ఏలేటి రామయ్యపల్లిలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న చోట బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకను గెలిపిస్తేనే తెలంగాణ ప్రగతి సాధన కొనసాగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి నెరవేర్చలేదని విమర్శించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ లీడర్లు వస్తే బుద్ధిచెప్పడానికి మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈనెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్‌గౌడ్, సీనియర్ నాయకులు ఎం రవీందర్‌రావు, రమణాచారి, అల్లం రవి, వీరస్వామి, దామెర రాజు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

ములుగురూరల్, మే 3 : వైద్యాధికారులు నెల వారీ సేవలను మెరుగుపర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ములుగు జిల్లా దవాఖాన వైద్యాధికారులతో పాటు ఏటూరునాగారం, వెంకటాపురం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విద్యార్థులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. దవాఖానల్లో 100 శాతం ప్రసవాలు జరుగాలన్నారు. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి సేవలపై అవగాహన కల్పించేలా సూచనలు అందించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని, మాతా శిశు సంరక్షణ సేవలపై పర్యవేక్షించాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. క్షయ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ఉన్నతమైన సేవలను అందించాలన్నారు. రానున్న వర్షకాలంలో జాతీయ కీటక జనత నియంత్రణ కార్యక్రమంపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. వైద్యాధికారులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ జగదీశ్వర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్స్

కృష్ణ కాలనీ, మే 3: వనపర్తి జిల్లా కేంద్రంలో ఈనెల 1, 2న నిర్వహించిన కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్-2024 రాష్ట్ర స్థాయి పోటీల్లో భూపాలపల్లి జిల్లా క్రీడాకారులు బంగారు పతకాలు సాధించినట్లు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసి శ్రీనివాస్, కోచ్ గోశిక అశోక్ తెలిపారు. క్రియేటివ్ ఫామ్ వెపన్ విభాగంలో బోగా శ్రీవేణి, ఐలవేణి నిత్య, ఐలవేణి కుశంత్, కంటే భాను మైత్రేయ గోల్డ్ మెడల్స్, తడబోయిన హరిణి సిల్వర్‌మెడల్, పాయింట్ ఫైటింగ్, లైట్ కాంటాక్ట్ విభాగాల్లో శ్రీవైష్ణవి రెండు గోల్డ్ మెడల్స్, సంజనశ్రీ రెండు గోల్డ్ మెడల్స్, భానుమైత్రేయ, కుశాంత్ గోల్డ్‌మెడల్స్, హరిణి, శ్రీవేణి, విదిశా దేవి బ్రాంజ్ మెడల్స్, నిత్యశ్రీ సిల్వర్ మెడల్స్, కుశంత్ గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్, మాస్టర్లు రాజనర్సు, శేఖర్, రాజు, తిరుపతి అభినందించారు.

## క్రికెట్ శిక్షణ శిబిరం పరిశీలన

ములుగురూరల్, మే 3 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రికెట్ శిబిరాన్ని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, చాగంటి శ్రీనివాస్ సందర్శించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 28 సెంటర్లలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపు ముగిసిన వెంటనే అంతర్‌జిల్లా టోర్నీకి అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురాం, కార్గవర్గ సభ్యులు అభినవ వినయ్, కోచ్ కుమార్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల కలలు నిజం చేయాలి

భూపాలపల్లి రూరల్, మే 3: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. జిల్లాలో ఈ ఏడాది పదోతరగతి పరీక్ష ఫలితాల్లో చిట్యాల కేజీబీవీ విద్యార్థి కొత్తూరు అంజన్న, పెద్దాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఊరుగొండ సాహిత్య, గాంధీనగర్ మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాల విద్యార్థులు గడ్డం అక్షయ, ముత్యాల అభినయ 10 జీపీఏ సాధించారు. శుక్రవారం వారిని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ భవేశ్‌మిశ్రా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. డీఈవో ఎన్.రాంకుమార్, ఎంఈవో రఘుపతి, ఏఎంవో లక్ష్మణ్, ప్రిన్సిపాల్స్ శాంత, ఆశీర్వాదం, పరీక్షల సహాయకుడు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## షార్ట్ ఫిలిం చిత్రీకరణ

ఏటూరునాగారం, మే 3 : మండల కేంద్రానికి చెందిన గోరంట్ల సత్యం దర్శకత్వంలో శుక్రవారం ఉదయం 'ఇస్మార్ట్ దొంగలు' షార్ట్ ఫిలిం సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సన్నివేశ ప్రారంభోత్సవం ఆకుల వారిఘనపూర్‌లోని హనుమాన్ ఆలయం సన్నిధిలో నిర్వహించారు. సీఐ రాజు క్లాప్ ఇవ్వగా, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, డాక్టర్ వరప్రసాద్ రావు కెమెరా ఆన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు గోరంట్ల సత్యం మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యం తనిఖీలు చేయడం లాంటి సన్నివేశాలతో షార్ట్ ఫిలిమ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తారాగణం పెండ్యాల భాస్కర్, పెండ్యాల ప్రభాకర్, కోడి వెంకటేశ్వర్లు, నూతి రమేశ్, ఎంవీ ప్రతాప్, రాజమొగిలి, ఆనంద్, నిర్మాతలు గోరంట్ల రజిత, శ్రీ హర్షిత, సంగీతం బల్లెపల్లి మోహన్, కెమెరా మెన్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేయాలి

ములుగురూరల్, మే 3 : బాలల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేయాలని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ కే వసుధ సూచించారు. శుక్రవారం డీడబ్ల్యూవో స్వర్ణలతాలెనినాతో కలిసి జిల్లా కేంద్రంలోని బాల రక్షాభవన్‌లో జిల్లా బాలల పరిరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్, బాల సందనం సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించి, మాట్లాడారు. బాలల పరిరక్షణలో పనిచేస్తున్న అన్ని శాఖల ఉద్యోగులు మధ్య సమన్వయం ఉండాలన్నారు. జిల్లాలోని అర్హులైన బాలికలు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో లేదా అంగన్‌వాడీ టీచర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా బాల పరిరక్షణ అధికారి ఓంకార్, ఆయా విభాగాల సిబ్బంది ఉన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

టేకుమట్ల, మే 3: బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రామకృష్ణపూర్(టీ)లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల జరిగే నష్టాలు, బీఆర్ఎస్ పార్టీ గెలవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్మికశాఖ మండల అధ్యక్షుడు నేరెళ్ల రామకృష్ణగౌడ్, వైస్ ఎంపీపీ పోతనవేణి ఐలయ్య, ఆది రఘు, బొడ్డు సదానందం, బండెల నరేశ్, ఒరుగంటి సదాకర్, లింగారెడ్డి, నేరెళ్ల శ్రీను, పెర్కారి నర్సింగరావు, కట్ల శ్రీను, చదువు మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, మారెపల్లి మహేందర్, మేకల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

**Form C-1**

**(For Candidate publish in Newspapers, TV.)**

Declaration about criminal cases.

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil ) No. 536 of 2011 (Public interest Foundation & Ors. Vs. Union of India & Anr.)

Name and address of candidate: **MALOTH KAVITHA, W/o Bhadrunayak, Aged 44 Years, Resident of H.No.6-1-94/6/D, Kondapally Gopal Rao Nagar, Kankar Boad, Mahabubabad Town, Mahabubabad District, Telangana- 506101.**

Name of political party : **BHARAT RASHTRA SAMITHI (BRS)**

(Independent candidates should write " Independent" here)

Name of election : **General Elections to House of People - 2024.**

Name of Constituency :**16-MAHABUBABAD (ST) PARLIAMENTARY CONSTITUENCY, TELANGANA**

I, **MALOTH KAVITHA** a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents:

| Sl No. | (A) Pending cases | | | |
|---|---|---|---|---|
| | Name of Court | Case No. and Dated | Status of Case(s) | Section (s) of Acts concerned and brief description of offence(s) |
| 1) | CC NO.23/2016 SPL. JFCM(PCR) COURT AT WARANGAL | FIR NO.121 OF 2014, Police station: BODRAI GOLLAGUDEM, GUDUR, MAHABUBABAD DIST. | Case is under investigation. | U/S.171(e)(f) 188 R/w. 34 IPC Sec. 127(a) RP Act. It is alleged that the candidate distributed money to voters and violated Model Code of conduct. |
| 2) | Not Applicable | FIR NO.53 OF 2024 Police Station:DUM-MUGUDEM, BHADRADI KOTHAGUDEM DISTRICT | Case is under investigation. | U/S.188,171(C) Of IPC. It is alleged that the candidate attended a meeting without prior permission and violated Model Code of conduct. |

(B) Details about cases of conviction for criminal offences

| Sl No. | Name of Court & date(s) of order(s) | Description of offences(s) & punishment imposed | Maximum Punishment Imposed |
|---|---|---|---|
| 1 | -Not Applicable- | -Not Applicable- | -Not Applicable- |
| 2 | -Not Applicable- | -Not Applicable- | -Not Applicable- |

*Sd/-*
**MALOTH KAVITHA**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**మార్కెటింగ్ టీం కావలెను**

jobs Apply Now!

★రియల్ ఎస్టేట్ రంగంలో అభివృద్ధిని కోరుకునే యువకులకు చక్కని అవకా